



డాక్టరేట్లు అందుకున్న రాంచరణ్, వీరముత్తువేల్, వేలు, శరత్‌కమల్ తదితరులతో చాన్సలర్ గణేశ్, ప్రొఫెసర్ సీతారాం

డిగ్రీలకు ప్రతిభ తోడైతేనే ఉపాధి

ఏఐసీటీఈ ఛైర్మన్ టీజీ సీతారాం ● ఘనంగా వేల్స్ వర్శిటీ స్నాతకోత్సవం

చెన్నై, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం దేశవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం వెల్లివిరుస్తోందని, ఈ పరిస్థితుల్లో విద్యార్థులు పొందే పట్టాలకు ప్రతిభ తోడైతేనే ఉపాధి అవకాశాలు లభిస్తాయని అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) అధ్యక్షుడు ప్రొఫెసర్ టీజీ సీతారాం పేర్కొన్నారు. శనివారం సాయంత్రం జరిగిన వేల్స్ విశ్వవిద్యాలయం 14వ స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్నాతకోత్సవ సందేశం ఇచ్చారు. వేల్స్ వర్శిటీలో వివిధ కోర్సుల్లో చదివి పట్టాలు పొందుతున్న నాలుగువేల మందికి పైగా విద్యార్థులకు తానిచ్చే ముఖ్యమైన సందేశం ఏమిటంటే ఉద్యోగాల కోసం వెంపర్లాడే పద్ధతికి స్వస్తి చెప్పి పదుగురికి ఉద్యోగాలిచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఉన్నతస్థితికి చేరే దిశగా ప్రయత్నాలు ప్రారంభించాలన్నారు. ప్రస్తుతం డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్రను పోషిస్తున్నాయని, ఈ రెండు రంగాలపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం ఉపాధి అవకాశాలు కల్పించే ప్రభుత్వ రంగ సంస్థ అయినా, ప్రైవేటు సంస్థ అయినా డిగ్రీల కంటే అదనంగా ఉన్న ప్రతిభాపాటవాలనే పరిగణనలోకి తీసుకుని ఉద్యోగాలిస్తున్నాయనే విషయాన్ని విద్యార్థులు మరవకూడదన్నారు. ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కోర్సులకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉందని, సాంకేతిక విద్యనభ్యసించే విద్యార్థులు కూడా వారి విభాగాల్లో జరుగుతున్న తాజా మార్పులను గమనించాలన్నారు. ఈ స్నాతకోత్సవంలో విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ ఐసిరి గణేశ్, ప్రొఫెసర్ టీజీ సీతారాం చేతుల మీదుగా 4,555 మంది డిగ్రీలు స్వీకరించారు. విశ్వవిద్యాలయం ప్రొ ఛాన్సలర్లు డాక్టర్ ఎ.జ్యోతి మురుగన్, డాక్టర్ ఆరతి గణేశ్, వేల్స్‌గ్రూపు ఉపాధ్యక్షులు డాక్టర్ ప్రీతా గణేశ్ పాల్గొన్నారు. తొలుత చంద్రయాన్ ప్రాజెక్టు-3 ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ పి.వీరముత్తువేల్, ట్రివిట్రాన్ హెల్త్‌కేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జీఎస్‌కే వేలు, గ్లోబల్ స్టార్ రాంచరణ్, ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడు పద్మశ్రీ శరత్‌కమల్ ఆచంట గౌరవ డాక్టరేట్లను అందుకున్నారు. ఈ సందర్భంగా వేల్స్ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఛాన్సలర్ డాక్టర్ ఐసిరి గణేశ్ మాట్లాడుతూ... ప్రముఖ తెలుగు సినీనటుడు రాంచరణ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయడంతో తమ విశ్వవిద్యాలయం కీర్తి మరింత పెరిగిందని చెప్పారు. సినీరంగానికి కూడా తమ విశ్వవిద్యాలయం ప్రోత్సాహమిస్తోందని, ఆ దిశగానే వీస్కామ్ కోర్సును నడుపుతున్నామని, ఆ కోర్సులో ఉత్తీర్ణులైనవారికి సినిమాలలో అవకాశాలు కూడా కల్పిస్తున్నామని వివరించారు.

ఈసారి ఇళయ దళపతి వర్గం ఎటువైపో?

ఆయన అభిమానుల్ని ప్రసన్నం చేసుకునేందుకు అన్ని పార్టీలూ పోటీ?



చెన్నై, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలొచ్చినా ప్రముఖ నటులు రజనీకాంత్, 'దళపతి' విజయ్ ఎవరిపక్షమన్న దానిపై తీవ్ర చర్చ జరుగుతుంది. రజనీ అయితే రాజకీయాలను పూర్తిగా వదిలేసినట్లే గనుక ఆయన అభిమానులు వారి ఇష్టానుసారంగా నిర్ణయం తీసుకుంటారని ఇప్పటికే స్పష్టమైపోయింది. దీనికి తోడు ఆయన ఇటు డీఎంకే నేతలతోనూ, అటు బీజేపీ అగ్రనేతలతోనూ సన్నిహిత సంబంధాలున్నందున, ఎవరికి వారుగా ఆయా పక్షాలను ఆశ్రయిస్తున్నది సుస్పష్టం. ఇక ఇటీవలే 'తమిళగ వెట్రి కళగం' పార్టీని స్థాపించి, రాష్ట్ర వ్యాప్తంగా యువతలో సరికొత్త ఆశలు రేపిన దళపతి విజయ్ ఎటువైపు అన్నది ఇప్పుడు సర్వత్రా ఆసక్తిగా మారింది. విజయ్ పార్టీని స్థాపించిన కొద్దినాళ్లకే 76 లక్షల మంది ఆ పార్టీ సభ్యత్వం స్వీకరించారు. పార్టీ స్థాపన నుంచి ఆయన కేవలం ప్రకటనల ద్వారా మాత్రమే పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. తమిళనాడు ప్రజలు ఏం ఆశిస్తున్నారో తాము దాన్ని నెరవేరుస్తామని పదేపదే ప్రకటిస్తున్నారు. అంతేగాక పార్టీ సిద్ధాంతాలు, జెండా, అజెండా తదితరాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఏం చేయాలన్నది తాను చూసుకుంటానని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. కాగా ఆయన ఇంకా పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి దిగలేదనే చెప్పాలి. మరోవైపు విజయ్ పూర్తిస్థాయి రాజకీయ నేతగా మారాలని తమిళ రాజకీయాల్లో చక్రం తిప్పాలని ఆయన అభిమానులు, కార్యకర్తలు కోరుకుంటున్నారు. అయితే 2026 అసెంబ్లీ ఎన్నికలే తమ లక్ష్యమని, ఈ లోక్‌సభ ఎన్నికల్లో తాము తటస్థంగా ఉంటామని ఇప్పటికే విజయ్ ప్రకటించారు. దీంతో ఈ ఎన్నికల్లో ఆయన పార్టీ పోటీ చేయనందున, ఆయన అభిమానులు, కార్యకర్తలను తమవైపు తిప్పుకునేందుకు అన్ని పార్టీల నేతలు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. గతంలో విజయ్‌తో తాము సన్నిహితంగా వున్న ఫొటోలను విస్తృతంగా ప్రచారం చేసుకుంటుండడంతో పాటు ఆయన వీరాభిమానుల్ని ప్రసన్నం చేసుకుని తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. విజయ్ మాత్రం వీటన్నింటికీ దూరంగా ఓ చిత్రం షూటింగ్ కోసం ఆస్ట్రేలియాలో బిజీగా గడుపుతున్నారు. ఆయన ఈ నెల 17, 18 తేదీల్లో చెన్నైకి వచ్చే అవకాశముందని సమాచారం.





మంత్రి ఉదయనిధికి వెండి ఖడ్గం బహూకరిస్తున్న ఎంపీ కనిమొళి - తిరుచెందూర్ రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి ఉదయనిధి

సనాతన ధర్మాన్ని అవమానిస్తారా?

డీఎంకే నేతలపై అమిత్‌షా ఆగ్రహం ● కన్నియాకుమారిలో అట్టహాసంగా రోడ్ షో



కన్యాకుమారిలో రోడ్డుపై మహిళలతో మాట్లాడుతున్న అమిత్ షా

చెన్నై, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డీఎంకే నేతలు సనాతన ధర్మాన్ని అవమానించి, హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆగ్రహం వ్యక్తం చేశారు. కన్నియాకుమారి, తక్కలైలో బీజేపీ అభ్యర్థి పొన్ రాధాకృష్ణన్‌కు మద్దతుగా శనివారం ఉదయం అమిత్‌షా రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ... తనకు కన్నియాకుమారి జిల్లాతో ఎనలేని ఆత్మీయానుబంధం ఉందన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో పొన్ రాధాకృష్ణన్‌ను, ఉపఎన్నిక జరగనున్న విలవంగోడు అసెంబ్లీ నియోజకవర్గంలో నందినిని గెలిపించాలని పిలుపునిచ్చారు. వారిని గెలిపిస్తే మళ్లీ విజయోత్సవ సభలో కూడా తాను పాల్గొంటానన్నారు. దేశవ్యాప్తంగా అన్ని పార్లమెంటు నియోజకవర్గాల్లో ఎన్‌డీఏ కూటమి గెలుపు కోసం పార్టీ నాయకులు, మిత్రపక్షాల నేతలు సైనికుల్లా రేయింబవళ్లు పని చేస్తున్నారని తెలిపారు. తమిళ భాష, సంస్కృతి, తమిళనాడుకు ఘనత చేకూర్చేలా ప్రధాని నరేంద్రమోదీ విదేశాల సభల్లోనూ ప్రస్తావిస్తుండడంతో పాటు సెంగోల్‌ను పార్లమెంటులో ప్రతిష్ఠించారని గుర్తు చేశారు. తాను తమిళ భాషను అమితంగా ప్రేమిస్తానని, అయితే మాట్లాడలేకపోవడం బాధగా ఉందన్నారు. అయితే మరో మూడునాలుగు నెలల్లో తమిళం నేర్చుకుని, ఇక్కడే ప్రజల మధ్య తమిళంలో మాట్లాడతానన్నారు. అన్నాడీఎంకే, డీఎంకేలు అధికారంలో ఉన్నప్పుడు విపరీతంగా దోచుకున్నాయని, ఈ దోపిడీని నిలదీసిన కారణంగానే ఆ రెండు పార్టీలు బీజేపీపై విమర్శలు కురిపిస్తున్నాయన్నారు. డీఎంకే నేతలు సనాతన ధర్మాన్ని, అయోధ్య రామమందిరం గురించి కించపరిచేలా మాట్లాడుతున్నారని, అందుకే ప్రజలు డీఎంకేకు గుణపాఠం చెబుతారని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు. డీఎంకే నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతూ కోట్లాదిమంది హిందువుల మనసులను బాధపెడుతున్నారని, అయినా తాము అందరినీ సమానంగా చూస్తున్నామన్నారు. మోదీ మూడోసారి ప్రధానిగా వస్తే దేశంలో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. అదే విధంగా పొన్ రాధాకృష్ణన్‌ను గెలిపిస్తే, ఆయనకు మంత్రివర్గంలో స్థానం కల్పిస్తామని హామీనిచ్చారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ తాను పర్యటించిన ప్రాంతాల్లో బీజేపీ 400 చోట్ల గెలుస్తుందని స్వయంగా ప్రజలే చెబుతున్నారన్నారు. ఈ సందర్భంగా 'తామర గుర్తుపైనే బటన్ నొక్కుతారా?' అంటూ తమిళంలో రాసుకొచ్చి అడగ్గా, అందుకు అక్కడున్న ప్రజల నుంచి 'అవును' అనే సమాధానం వచ్చింది. తక్కలై పాత బస్టాండు నుంచి ప్రారంభమైన అమిత్‌షా రోడ్ షో, మేట్టుక్కడై వరకు కొనసాగింది. అనంతరం అమిత్‌షా కారులో నాగర్‌కోయిల్ ఆర్మ్‌డు రిజర్వ్ పోలీస్ గ్రౌండ్‌కు చేరుకుని, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో కేరళకు పయనమయ్యారు.

'ఇండియా' కూటమి గెలిస్తేనే అభివృద్ధి

● తిరుచెందూర్‌లో మంత్రి ఉదయనిధి

ప్యారీస్, ఏప్రిల్ 13: ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపిస్తేనే దేశవ్యాప్తంగా అభివృద్ధి జరుగుతుందని మంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. తూత్తుకుడి పార్లమెంటు నియోజకవర్గ డీఎంకే అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ కనిమొళికి మద్దతుగా తిరుచెందూర్‌లో శనివారం జరిగిన ప్రచార సభలో ఉదయనిధి పాల్గొన్నారు. భారీగా తరలివచ్చిన ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతుండగా, కొందరు మహిళలు 'నాయనా బంగారం ధర పెరిగింది, తగ్గించేందుకు మార్గాలు లేవా' అని ప్రశ్నించారు. అందుకు ఉదయనిధి సమాధానమిస్తూ... బంగారం ధరకు, తమిళనాడు ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని వివరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పుణ్యమా అని పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు గ్యాస్, బియ్యం, వాహనాలతో పాటు బంగారం ధరలు అమాంతంగా పెరిగిపోతున్నాయని, ప్రజలు దీన్ని అర్థం చేసుకోవాలన్నారు. 2014 సంవత్సరంలో రూ.400కు విక్రయమైన గ్యాస్ సిలిండర్ ప్రస్తుతం రూ.1,200కు పెంచారని, అయితే లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధిపొందాలన్న దృష్టితో ఎన్నికల ముందు సిలిండర్‌కు రూ.100 మాత్రం తగ్గించి నాటకమాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమిని గెలిపిస్తే కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు రూ.500కు గ్యాస్ సిలిండర్ విక్రయిస్తామన్నారు. అదే విధంగా పెట్రోల్ లీటరు రూ.75, డీజిల్ లీటరు రూ.65కు విక్రయిస్తామన్నారు. అలాగే, రాష్ట్ర ప్రజలపై మోపిన పన్నుల భారం తగ్గిస్తామని, రాష్ట్రంలో జాతీయ రహదారుల్లో ఉన్న అన్ని టోల్‌గేట్లు ఎత్తి వేస్తామని, అందువల్ల కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండబోదన్నారు. రాష్ట్ర హక్కులు కాపాడుకొనేందుకు ఇండియా కూటమిని గెలిపించాలని ఉదయనిధి ప్రజలకు పిలుపునిచ్చారు.

మోదీని ఇంటికి పంపేందుకే 'ఇండియా' కూటమి

● అవినాశి ప్రచార సభలో ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మోదీని గద్దె దింపేందుకే 'ఇండియా' కూటమి ఏర్పాటైందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అన్నారు. తిరుప్పూర్ జిల్లా అవినాశిలో డీఎంకే కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... తొమ్మిదేళ్ల బీజేపీ పాలనలో దేశం అధోగతి పాలైందన్నారు. ప్రజా, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబించడంలో బీజేపీ ముందంజలో ఉందన్నారు. బీజేపీ పాలనలో పేద, బలహీనవర్గాలపై దాడులు అధికమయ్యాయన్నారు. ఇటీవల ఎన్నికల ప్రచార సభలో జీఎస్టీఎందుకు విధించారు అని ప్రశ్నించిన మహిళపై బీజేపీ కార్యకర్తలు దాడికి పాల్పడడం ఇందుకు ఉదాహరణ అని తెలిపారు. మరోసారి మోదీ అధికారం చేపడితే దేశంలో రిజర్వేషన్లు అనే పదమే ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతి పక్ష పార్టీల నేతలపై ఐటీ, ఈడీ, సీబీఐ దాడులు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీ కోట్ల రూపాయల అవినీతి సుప్రీంకోర్టు జోక్యంతో వెలుగుచూసిందన్నారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గినా దేశంలో పెట్రో ధరలు తగ్గించని బీజేపీ ప్రభుత్వం, ఎన్నికలు రావడంతో హడావుడిగా ధరలు తగ్గించిందన్నారు. బీజేపీ పాలనలో దారిద్ర్యరేఖకు దిగువున్న శాతం పెరుగుతుండగా, అందుకు విరుద్ధంగా పేదరికాన్ని నిర్మూలించామని పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రపంచంలోని పలు సంస్థలు వెలువరించిన గణాంకాలు ఈ విషయాన్ని ధ్రువీకరిస్తున్నాయన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. అలాగే, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ ఢిల్లీలో నిరసన చేపట్టిన రైతులపై దాడులు చేసిన చరిత్ర బీజేపీకి ఉందన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టో 'ఇండియా' కూటమి విజయానికి దోహదపడుతుందని అన్నారు. పదేళ్ల మోదీ పాలన చూసిన ప్రజలు, రాబోయే ఎన్నికల్లో ఆయనను గద్దె దింపేందుకు సిద్ధంగా ఉన్నారని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు.

జూన్ 4 తరువాత దినకరన్ చేతికి అన్నాడీఎంకే పగ్గాలు

● అన్నామలై సంచలన వ్యాఖ్యలు



దినకరన్‌తో కలిసి ప్రచారం చేస్తున్న అన్నామలై

పెరంబూర్, ఏప్రిల్ 13: పార్లమెంటు ఎన్నికల అనంతరం అన్నాడీఎంకే పగ్గాలు టీటీవీ దినకరన్ చేతుల్లోకి వస్తాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈనెల 19న జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమి తరఫున అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) పార్టీకి రెండు స్థానాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ స్థానాల్లో తేని నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్‌కు మద్దతుగా శనివారం అన్నామలై ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా అన్నామలై మాట్లాడుతూ... అన్నామలై, దినకరన్ ఎందుకు ఒకటిగా చేరారని పలువురు ప్రశ్నిస్తున్నారని, వారందరికి సమాధానం రాష్ట్ర రాజకీయాల్లో మార్పు తీసుకురావడం కోసమేనని అన్నారు. 2026లో రాష్ట్రంలో అధికారం చేపట్టేది ఎవరో తేల్చేవి ఈ ఎన్నికలన్నారు. దేశాన్ని రక్షించాలని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వ్యాఖ్యానిస్తున్నారని, తొలుత గోపాలపురం నుంచి రాష్ట్రాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 32 నెలల కాలంలో అవినీతికి పాల్పడుతూ అందినంత దోచుకున్నారని, వారి నుంచి రాష్ట్రాన్ని రక్షించేందుకే బీజేపీ నేతృత్వంలో కూటమి ఏర్పాటైందన్నారు. తేని నుంచి టీటీవీ దినకరన్, రామనాథపురం నుంచి మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం లాంటి సీనియర్ నేతలు కూటమి తరఫున పోటీ చేస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో తాను పోటీ చేయకుండా పార్టీ తరఫున మరెవరైనా అభ్యర్థిని నిలపవచ్చని, కానీ, ప్రధానిగా మూడో సారి నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు కావాలనే సంకల్పంతో తానే స్వయంగా పోటీకి దిగానన్నారు. ఒక వైపు స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కూటమి, మరోవైపు ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలోని అన్నాడీఎంకే కూటమి పోటీ చేస్తున్నాయని, పార్టీల పేర్లు వేరైనా రెండు పార్టీల ఆలోచనలు ఒకటేనన్నారు. ఆ రెండు కూటములు కలసి దినకరన్‌ను ఓడించాలని వ్యూహాలు పన్నుతున్నాయన్నారు. కానీ, ప్రజలు తమ వైపే ఉన్నారన్నారు. ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే కార్యకర్తలు టీటీవీ దినకరన్‌కు ఓటేసేందుకు సిద్ధంగా ఉండడంతో పాటు తమకు నేతగా ఆయనే రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. జూన్ 4వ తేది అనంతరం అన్నాడీఎంకే పగ్గాలు దినకరన్ చేతికి వస్తాయని, అటు అన్నాడీఎంకే, ఇటు ఏఎంఎంకే కార్యకర్తలు దీన్ని కోరుకుంటున్నారని అన్నారు. దినకరన్ పార్టీ పగ్గాలు చేపట్టిన అనంతరం రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు చోటుచేసుకుంటాయని, ఆ విషయం గ్రహించినందునే స్టాలిన్, పళనిస్వామి ఆయన్ని ఓడించేందుకు రహస్య ఒప్పందాలు చేసుకుంటున్నారని అన్నామలై ఆరోపించారు.

మమ్మల్ని విచ్ఛిన్నం చేయాలనుకొనేవారు గాల్లో కొట్టుకుపోతారు

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి



చెన్నై, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకేను విచ్ఛిన్నం చేయాలనుకొనేవారు గాల్లో కొట్టుకుపోతారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఘాటుగా సమాధానమిచ్చారు. చిదంబరం లోక్‌సభ అన్నాడీఎంకే అభ్యర్థికి మద్దతుగా శనివారం సాయంత్రం అరియలూరులో జరిగిన ప్రచార సభలో పళనిస్వామి మాట్లాడుతూ... దేశంలోనే అత్యధిక కార్యకర్తలు కలిగిన పార్టీగా అన్నాడీఎంకే ఉందన్నారు. అలాంటి పార్టీని విచ్ఛిన్నం చేస్తామని పలువురు పేర్కొంటున్నారని, జూన్ 4 తర్వాత ఎవరు కనిపించకుండా పోతారో తెలుస్తుందన్నారు. మమ్మల్ని బెదిరించే పనులు చేపట్టవద్దని హితవు పలికారు. అదే సమయంలో పార్టీని చిన్న చూపు చూడొద్దని, అలా చూసిన వారిని 2 కోట్ల మంది కార్యకర్తలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ప్రజలకు మేలుచేసే పథకాలు అమలు చేస్తే స్వాగతిస్తామని, అదే సమయంలో ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని తెలిపారు. రాష్ట్రప్రజల సంక్షేమం కోసమే తాము బీజేపీ కూటమి నుండి వైదొలిగామన్నారు. మూడేళ్ల డీఎంకే పాలనలో ప్రజలను పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం ఎన్నికలు వస్తుండడంతో ముఖ్యమంత్రి ఊరూరా తిరుగుతూ దుకాణాల్లో టీ తాగడం, మార్నింగ్ వాక్ చేపట్టడం తదితరాలు చేస్తూ ఫొటోలకు ఫోజులిస్తున్నారన్నారు. రాష్ట్రంలో గంజాయి దొరకని ప్రదేశమే లేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు బీజేపీ ప్రభుత్వం పాల్పడితే వాటిని ఎదుర్కొనే సత్తా అన్నాడీఎంకేకు ఉందన్నారు. కూటములను నమ్మి తాము ఎన్నికల్లో పోటీ చేయడం లేదని, ప్రజలను నమ్మి పోటీ చేస్తున్నామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని పళనిస్వామి తెలిపారు. అన్నాడీఎంకే పగ్గాలు దినకరన్ చేతికి వస్తాయంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ సీనియర్ నేత జయకుమార్ తీవ్రంగా స్పందించారు. తమ పార్టీని హస్తగతం చేసుకోవడం వారి తరం కాదని బదులిచ్చారు. రాజకీయాల్లో అన్నామలై బచ్చా అని, అతని మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు.

సమాచార ధ్వని

చెన్నై - మారిషస్ విమాన సేవలు ప్రారంభం

ఐసిఎఫ్, ఏప్రిల్ 13: చెన్నై నుంచి మారిషస్‌కు మొదటి విమాన సేవలు శనివారం ప్రారంభమయ్యాయి. నాలుగేళ్ల అనంతరం ఏప్రిల్ 13న విమాన సేవలు ప్రారంభించినట్లు మారిషస్ దేశ విమాన సంస్థ ఎయిర్ మారిషస్ ప్రకటించింది. ఆ ప్రకారం, చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 173 మంది ప్రయాణికులతో మొదటి విమానం శనివారం వేకువజామున ఆ దేశానికి బయల్దేరి వెళ్లింది. ప్రతి శనివారం ఈ విమానాన్ని నడపనున్నట్లు అధికారులు ప్రకటించారు. ఎయిర్ మారిషస్ ప్రస్తుతం ముంబై నుంచి వారానికి ఆరు సార్లు, ఢిల్లీ నుంచి వారానికి మూడు సార్లు విమాన సేవలు నిర్వహిస్తోంది.

విద్యుదుత్పత్తికి అంతరాయం

ఐసిఎఫ్, ఏప్రిల్ 13: ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగింది. అత్తిపట్టులోని మొదటి థర్మల్ విద్యుత్ కేంద్రంలో తలా 210 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు యూనిట్లు, విస్తరణ కేంద్రంలో తలా 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లలో ఉత్పత్తి జరుగుతోంది. ఈ విద్యుత్ చెన్నై, చుట్టుపక్కల జిల్లాల విద్యుత్ అవసరాలు తీరుస్తోంది. ఈ నేపథ్యంలో, మొదటి కేంద్రంలోని ఒకటి, రెండు యూనిట్లు, విస్తరణ కేంద్రంలోని యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ పంక్చర్ కారణంగా ఉత్పత్తికి అంతరాయం కలిగినట్లు అధికారులు తెలిపారు.

16న తిరుచ్చికి స్థానిక సెలవు

ఐసిఎఫ్, ఏప్రిల్ 13: సమయపురం మారియమ్మన్ ఆలయ ఉత్సవాలను పురస్కరించుకొని ప్రభుత్వం ఈ నెల 16వ తేది తిరుచ్చికి స్థానిక సెలవు ప్రకటించింది. ఆ రోజుకు బదులుగా జూన్ 8వ తేది పనిదినంగా ప్రకటిస్తూ తిరుచ్చి జిల్లా కలెక్టర్ ప్రదీప్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

పోరూర్ మెట్రో రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభం

ఐసిఎఫ్, ఏప్రిల్ 13: స్థానిక పోరూర్‌లో మెట్రో రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మెట్రో రైలు రెండవ విడత పథకంలో లైట్ హౌస్-పూందమల్లి వరకు ఉన్న మార్గంలో పోరూర్ మెయిన్ రోడ్డులో ఈ స్టేషన్ ఏర్పాటుకానుంది.ప్రయాణికుల సౌకర్యార్థం ఎస్కలేటర్లు, లిఫ్టులు, టాయిలెట్లు, సీసీ కెమెరాల వంటివి ఏర్పాటు చేయనున్నారు. నిర్మాణపనులు డిసెంబరులో పూర్తవుతాయని సీఎంఆర్‌ఎల్ అధికారులు తెలిపారు.

'నీట్' దరఖాస్తు సవరణకు అవకాశం

ఐసిఎఫ్, ఏప్రిల్ 13: 'నీట్'కు చేసుకున్న దరఖాస్తుల్లో సవరణలు చేపట్టేందుకు ఈ నెల 15వ తేది వరకు అవకాశం కల్పించినట్లు జాతీయ పరీక్షా ఏజెన్సీ ప్రకటించింది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు స్వీయ వివరాల్లో సవరణలు చేపట్టేందుకు శుక్రవారం వరకు గడువు ఇవ్వగా, ఇంకా కొందరు సవరణలు చేపట్టకపోవడంతో వారి సౌకర్యార్థం సోమవారం వరకు అవకాశం పొడిగించారు.

పళని ఆలయ హుండీ ఆదాయం రూ.5 కోట్లు

ఐసిఎఫ్, ఏప్రిల్ 13: దిండుగల్ జిల్లా పళని మురుగన్ ఆలయ హుండీ ఆదాయం రూ.5 కోట్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 8వ తేది అధికారుల సమక్షంలో జరిగిన లెక్కింపులో స్వచ్ఛంద సంస్థలు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. రూ.2,92,49,145 నగదు, 811 గ్రాముల బంగారం, 15 కిలోల 400 గ్రాముల వెండి వస్తువులు, 503 విదేశీ కరెన్సీ నోట్లు భక్తులు సమర్పించారు. శుక్రవారం జరిగిన రెండో విడత లెక్కింపులో రూ.2,36,88,742 నగదు, 385 గ్రాముల బంగారం, 6 కిలోల 383 గ్రాముల వెండి వస్తువులు, 214 విదేశీ కరెన్సీ నోట్లు భక్తులు కానుకలుగా సమర్పించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

'క్యూట్' ఫలితాల విడుదల

పెరంబూర్, ఏప్రిల్ 13: 'క్యూట్' మెయిన్స్ ఫలితాలను జాతీయ పరీక్షా ఏజెన్సీ విడుదల చేసింది. కొత్త విద్యా విధానం ప్రకారం, దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో యూజీ, పీజీ కోర్సుల్లో విద్యార్థుల అడ్మిషన్లు 'సీయూఈటీ (క్యూట్) అనే జాతీయ స్థాయి ప్రవేశపరీక్ష ఆధారంగా చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో, గత మార్చిలో నిర్వహించిన క్యూట్ పరీక్షా ఫలితాలు https://pgcuet.samarth.ac.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేశారు.

4-9 తరగతి వరకు సెలవులు ప్రారంభం

పెరంబూర్, ఏప్రిల్ 13: రాష్ట్రవ్యాప్తంగా శనివారం నుంచి 4 నుంచి 9వ తరగతి విద్యార్థులకు సెలవులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతుల వార్షిక పరీక్షల టైంటేబుల్ ఇదివరకే ప్రకటించగా, మధ్యలో రంజాన్ పండుగ రావడంతో రెండు పరీక్షలు తాత్కాలికంగా నిలిపివేసి, ఆ పరీక్షలు ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈ క్రమంలో, రాష్ట్రంలో ఈనెల 19న నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు పాఠశాలలు అప్పగించాల్సి రావడం, ఎన్నికల విధుల్లో ఉపాధ్యాయులు పాల్గొనాల్సి ఉండడంతో 4 నుంచి 9వ తరగతి విద్యార్థులకు శనివారం నుంచి ఈ నెల 21వ తేది వరకు సెలవు ప్రకటించారు. సెలవుల అనంతరం 22, 23 తేదీల్లో పరీక్షలు నిర్వహించి 24వ తేది నుంచి వేసవి సెలవులు ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ 4వ తేది తర్వాత పాఠశాలల ప్రారంభ తేదీ ప్రకటించనున్నారు.

18న ప్రభుత్వ బస్సుల్లో 20 వేలమంది రిజర్వేషన్


పెరంబూర్, ఏప్రిల్ 13: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా స్వగ్రామాల్లో ఓటు హక్కు వినియోగించుకొనే ప్రజల సౌకర్యార్థం రాష్ట్ర రవాణా సంస్థ ఈ నెల 17, 18, పోలింగ్ ముగిసిన తర్వాత 20, 21 తేదీల్లో రాష్ట్రంలోని ప్రధాన నగరాల నుంచి సుమారు 10,150 ప్రత్యేక బస్సులు నడపనుంది. ఆ ప్రకారం, ఈ ప్రత్యేక బస్సుల్లోని 1.27 లక్షల సీట్లకు ముందస్తు రిజర్వేషన్ ప్రారంభం కాగా, పోలింగ్ ముందు రోజైన 18వ తేది సొంతూళ్లకు వెళ్లేందుకు సుమారు 20,000 మంది రిజర్వేషన్ చేయించుకున్నారు. అలాగే, పోలింగ్ ముగిసిన తర్వాత ఆదివారం తిరుగు ప్రయాణమయ్యేందుకు 17,000 మంది రిజర్వేషన్ చేయించుకున్నారు. ప్రత్యేక బస్సుల వివరాలు, రిజర్వేషన్ తదితరాలకు నెం.9945014450, 9445014436లలో సంప్రదించవచ్చు.

19న మద్రాసు హైకోర్టుకు సెలవు

పెరంబూర్, ఏప్రిల్ 13: మద్రాసు హైకోర్టు, హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లకు ఈ నెల 19న సెలవు ప్రకటించారు. రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజకవర్గాలకు ఈ నెల 19న ఒకే విడతలో పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే. ఈ ఎన్నికల్లో 100 శాతం ఓటు హక్కు నమోదయ్యేలా ఎన్నికల సంఘం పలురకాల అవగాహన చర్యలు చేపట్టింది. 19న కర్మాగారాలు, వాణిజ్య సంస్థలు ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకొనేలా వేతనంతో కూడిన సెలవు ప్రకటించాలని కార్మిక సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో, పోలింగ్ జరగనున్న 19వ తేది మద్రాసు హైకోర్టు, హైకోర్టు మదురై శాఖలకు సెలవు ప్రకటిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు.

అది మీ తరం కాదు

● అన్నామలైకి జయకుమార్ కౌంటర్



పెరంబూర్, ఏప్రిల్ 13: రాజకీయాల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై బచ్చా అని, అతని మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి జయకుమార్ వ్యాఖ్యానించారు. జూన్ 4 తరువాత దినకరన్ చేతికి అన్నాడీఎంకే పగ్గాలు దినకరన్ చేతికి వస్తాయంటూ అన్నామలై చేసిన వ్యాఖ్యలపై జయకుమార్ మండిపడ్డారు. తమ పార్టీని హస్తగతం చేసుకోవడం ఎవరి తరం కాదన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కుల, మత రాజకీయాలను రాష్ట్ర ప్రజలు ఎన్నడూ సహించరన్నారు. టీటీవీ దినకరన్‌తో బీజేపీ ఎలాంటి రహస్య ఒప్పందం చేసుకుందో తెలియడం లేదన్నారు. ఎవరిని గెలిపించాలో నిర్ణయించేది ప్రజలన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ స్థాపించి, జయలలిత మార్గదర్శకంలో ప్రస్తుత ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి నేతృత్వంలో 2 కోట్ల మంది కార్యకర్తలతో అన్నాడీఎంకే పటిష్టంగా ఉందన్నారు. టీటీవీ దినకరన్‌పై ఎన్నో కేసులున్నాయని, ఆ కేసులు బనాయించింది బీజేపీ కాదా అన్ని ప్రశ్నించారు. కూటమిలో చేరిన వెంటనే ఆయన ఎలా సచ్ఛీలుడయ్యాడో బీజేపీ నేతలు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్కే నగర్ ఎన్నికల్లో ప్రజలకు రూ.20 టోకెన్లు ఇచ్చి గెలిచిన దినకరన్, ఒక్కసారైనా నియోజకవర్గంలో పర్యటించారా అని ప్రశ్నించారు. పోయెస్ గార్డెన్ పక్కకు రావద్దని జయలలిత గెంటివేసిన వ్యక్తి దినకరన్ అని, అలాంటి వ్యక్తి రాజకీయ చరిత్ర అన్నామలై తెలుకుని మాట్లాడితే బావుంటుందని హితవు పలికారు. పోలీసు శాఖ నుంచి వచ్చిన అన్నామలైది ఫాస్ట్‌ఫుడ్ వ్యవహారమన్నారు. ఇప్పుడు కొత్తగా ఆయన జోతిష్యం కూడా చెబుతున్నట్లుందని జయకుమార్ ఎద్దేవా చేశారు.

మూడు పెట్టెలతో 138 డ్రైవర్ రహిత మెట్రోరైళ్లు

● 2025 ఆగస్టులో పట్టాలపైకి : సీఎంఆర్‌ఎల్



డ్రైవర్ రహిత మెట్రో రైల్ నమూనా చిత్రం

పెరంబూర్, ఏప్రిల్ 13: నగరంలో మెట్రోరైలు రెండో ప్రాజెక్టులో మూడు మార్గాల్లో 116.1 కి.మీ పనులు వివిధ దశల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. వాటిలో మాధవరం పాల డిపో నుంచి సిప్కాట్ వరకు 45.8 కి.మీ మూడో మార్గం, లైట్ హౌస్ నుంచి పూందమల్లి వరకు 26.1 కి.మీ నాల్గో మార్గం, మాధవరం నుంచి షోళింగనల్లూర్ వరకు 47 కి.మీ ఐదో మార్గం పనులు రూ.63,246 కోట్లతో జరుగుతున్నాయి. ఈ మార్గాల్లో 119 మెట్రో రైల్వేస్టేషన్లు ఏర్పాటు కానున్నాయి. ఈ పనులను 2026 సంవత్సరాంతానికి పూర్తి చేయాలని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్‌ఎల్) లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో, రెండో ప్రాజెక్ట్‌లో డ్రైవర్ రహిత మెట్రో రైళ్లు నడపనున్నట్లు సీఎంఆర్‌ఎల్ ప్రకటించింది. డ్రైవర్ రహిత మెట్రోరైలు 2025 ఆగస్టు నుంచి పట్టాలపైకి ఎక్కనుంది. ఈ విషయమై సీఎంఆర్‌ఎల్ అధికారులు మాట్లాడుతూ.. రెండో విడత మెట్రోరైలు పథకంలో మూడు పెట్టెలతో 138 రైళ్లు నడపనున్నామని తెలిపారు. ఈ రైళ్ల తయారీ మూడు సంస్థలకు అప్పగించామని తెలిపారు. ఆటోమేటిక్ ఏఐ టెక్నాలజీతో, జీపీఎస్, సిగ్నల్ రీడింగ్, టైమింగ్ సీక్వెన్స్ తదితర సాంకేతిక పరిజ్ఞానంతో ఈ రైళ్లు నడుస్తాయన్నారు. అలాగే, ఈ మెట్రోరైళ్లకు ఎల్‌సీడీ స్క్రీన్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ రైళ్ల ప్రజల అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ముందుగా ఏడాది పాటు వివిధ దశల్లో ట్రయల్ రన్ నిర్వహిస్తామని తెలిపారు. మరో నెలరోజుల్లో తొలి డ్రైవర్ రహిత మెట్రో రైలు తయారీ పూర్తవుతుందని, అనంతరం ట్రయల్ రన్ నిర్వహిస్తామన్నారు. తొలివిడతగా పూందమల్లి - పోరూర్ మధ్య నడుపనున్న 26 డ్రైవర్ రహిత మెట్రోరైళ్లు వచ్చే ఏడాది సీఎంఆర్‌ఎల్‌కు అప్పగించనున్నారని వారు తెలిపారు.

జాఫర్ సాధిక్ ఇల్లు, కార్యాలయాల్లో తనిఖీలు

● ఆస్తి పత్రాలు, కీలక దస్తావేజుల స్వాధీనం

ప్యారీస్, ఏప్రిల్ 13: మాదకద్రవ్యాల స్మగ్లర్ జాఫర్ సాధిక్‌కు చెందిన చెన్నై, మదురై, తిరుచ్చిల్లోని ఇళ్లు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు శనివారం సోదాలు చేపట్టి కీలక దస్తావేజులు, ఆస్తుల పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీలో గత ఫిబ్రవరి 15న కేంద్ర మాదకద్రవ్యాల నివారణ విభాగం అధికారులు సోదాలు నిర్వహించి రూ.2 వేల కోట్ల విలువైన మాదకద్రవ్యాల తయారీకి వినియోగించే ముడి పదార్థాలు స్వాధీనం చేసుకున్న విషయం విదితమేన. ఈ కేసులో తమిళనాడుకు చెందిన ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారి ని విచారించడంతో జాఫర్ సాధిక్ స్మగ్లింగ్ ముఠాకు నాయకుడిగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. సినీ నిర్మాతగా ఉన్న ఆయన్ను మార్చి 9న పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ నెల 9న స్థానిక మైలాపూర్ శాంథోమ్‌లో ఉన్న జాఫర్ సాధిక్ ఇంట్లో తనిఖీలు నిర్వహించిన ఈడీ అధికారులు కొన్ని పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా, శనివారం ఉదయం సుమారు 30 మందికి పైగా ఈడీ అధికారులు మూడు బృందాలుగా చెన్నై, మదురై, తిరుచ్చి ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించడం గమనార్హం.

కనీస వసతుల కోసం మహిళల రాస్తారోకో



రాస్తారోకోలో మహిళలు

ప్యారీస్, ఏప్రిల్ 13: స్థానిక ఆవడి సమీపంలోని పాలమేడు పంచాయతీ పరిధి శాస్త్రినగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ మహిళలు రాస్తారోకో నిర్వహించారు. శాస్త్రినగర్‌లో సుమారు 500కు పైగా ఇళ్లున్నాయి. వీటిలో 2,000 మందికి పైగా నివసిస్తున్నారు. వీరు తమ ప్రాంతంలో తారు రోడ్డు నిర్మించాలని, తాగునీరు సరఫరా చేయాలని, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని తదితర డిమాండ్లతో వినతిపత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించినా ఫలితం లేకపోయింది. దీంతో, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ తదితర పార్టీల దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో సుమారు 200 మందికి పైగా మహిళలు పాలమేడు జంక్షన్ వద్ద రహదారిపై బైఠాయించారు. సమస్యలు పరిష్కరించకపోతే పార్లమెంటు ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరించారు.

పోలింగ్ రోజున సెలవివ్వని సంస్థలపై చర్యలు

● ఫిర్యాదులకు ప్రత్యేక నెంబర్లు

పెరంబూర్, ఏప్రిల్ 13: పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు ఇవ్వని కర్మాకారాలు, వాణిజ్య సంస్థలపై చర్యలు చేపడతామని చెన్నై జిల్లా ఎన్నికల అధికారి జె.రాధాకృష్ణన్ హెచ్చరించారు. చెన్నై జిల్లా పరిధిలో ఉత్తర చెన్నై, దక్షిణ చెన్నై, మధ్య చెన్నై అనే మూడు లోక్‌సభ నియోజకవర్గాలున్నాయని 100 శాతం పోలింగ్ నమోదయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా పోలింగ్ రోజున ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకొనేలా సెలవు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేశామన్నారు. నిబంధనలు ఉల్లఘించి పనిచేసే సంస్థలు, కర్మాగారాలు, దుకాణాలపై ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని రాధాకృష్ణన్ తెలిపారు. ఉత్తర చెన్నై లోక్‌సభ నియోజవర్గ పరిధిలో నెం.9840829835 (విజయలక్ష్మి, కార్మిక సంక్షేమ శాఖ సహాయ కమిషనర్, 1వ మండలం), దక్షిణ చెన్నై లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో నెం.9790930846 (ఏకాంబరం, కార్మిక సంక్షేమ శాఖ సహాయ కమిషనర్, 6వ మండలం), మధ్య చెన్నై లోక్‌సభ నియోకవర్గ పరిధిలో నెం.9884264814 (వేదనాయకి, కార్మిక సంక్షేమ శాఖ సహాయ కమిషనర్, 9వ మండలం), నెం.044-24330354లలో ప్రజలు ఫిర్యాదు చేయవచ్చు.

నేడు తమిళ సంవత్సరాది

నేతల శుభాకాంక్షలు ● ప్రధాని మోదీ సంతకంతో గ్రీటింగ్ కార్డులు

ప్యారీస్, ఏప్రిల్ 13: తమిళ సంవత్సరాదిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు పలు పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, రాష్ట్ర ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ తమిళంలో సంతకం చేసిన గ్రీటింగ్ కార్డులను ముద్రించారు. సుమారు 30 లక్షలకు పైగా కుటుంబాలకు ఈ కార్డులను బీజేపీ కార్యకర్తల ద్వారా పంపిణీ చేసే కార్యక్రమం శనివారం సాయంత్రం ప్రారంభమైంది. కాగా, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి జారీ చేసిన ప్రకటనలో... ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళులు ఐక్యతను చాటే విధంగా నూతన సంవత్సరాన్ని ఆహ్వానించి సంతోషంగా వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. అదే విధంగా ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్, వీకే శశికళ, టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ తదితరులు శుభాకాంక్షలు తెలుపుతూ వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు.

తరగతులు బహిష్కరించిన ఎయిమ్స్ వైద్య విద్యార్థులు

పెరంబూర్, ఏప్రిల్ 13: రామనాథపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో చదువుతున్న మదురై ఎయిమ్స్ వైద్య కళాశాల విద్యార్థులు శనివారం తరగతులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. మదురై తోప్పూరులో ఎయిమ్స్ ఆసుపత్రి, వైద్యకళాశాల నిర్మాణాలకు ఐదేళ్ల క్రితం ప్రధాని శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు ప్రహరీ నిర్మాణం మాత్రమే చేపట్టగా భవనాల నిర్మాణాలు ప్రారంభం కాలేదు. ఈ నేపథ్యంలో, ఎయిమ్స్‌లో రెండేళ్లుగా 150 విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించి, వారికి రామనాథపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో, కళాశాల ప్రాంగణంలో తగిన వసతులు లేవంటూ ఎయిమ్స్ కళాశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు.

విశాఖపట్టణం - కొల్లం మధ్య ప్రత్యేక రైళ్లు

వేళచ్చేరి, ఏప్రిల్ 13: వేసవి సీజన్ దృష్ట్యా విశాఖపట్టణం - కొల్లం మధ్య ప్రత్యేక ఛార్జీ రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. నెం.08539 విశాఖపట్టణం-కొల్లం ప్రత్యేక ఛార్జీ రైలు ఈ నెల 17, 24, మే 1, 8, 15, 22, 29, జూన్ 5, 12, 19, 26, జూలై 3 తేదీల్లో విశాఖపట్టణంలో ఉదయం 8.20 గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12.55 గంటలకు కొల్లం చేరుకుంటుంది. మరోమార్గంలో నెం.08540 కొల్లం - విశాఖపట్టణం ప్రత్యేక ఛార్జీ రైలు ఈ నెల 18, 25, మే 2, 9, 16, 23, 30, జూన్ 6, 13, 20, 17, జూలై 4వ తేదీల్లో సాయంత్రం 6.35 గంటలకు కొల్లంలో బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.209 గంటలకు విశాఖపట్టణం చేరుకుంటుంది. ఈ రైళ్ల రిజర్వేషన్ ప్రారంభమైంది.

డీఎంకే అంటే 'డ్రగ్స్ మున్నేట్ర కళగం'

● కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఎద్దేవా



సభలో ప్రసంగిస్తున్న నిర్మాలా సీతారామన్

ప్యారీస్, ఏప్రిల్ 13: డీఎంకే అంటే 'డ్రగ్స్ మున్నేట్ర కళగం' అని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వ్యాఖ్యానించారు. నీలగిరి లోక్‌సభ నియోజక వర్గంలో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి ఎల్.మురుగన్‌కు మద్దతుగా శనివారం ఉదయం అవినాశిలోని మంగళం రోడ్డులో ఓ కల్యాణ మండపంలో మహిళా స్వయం సహాయక బృందాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో నిర్మలా సీతారామన్ ప్రసంగించారు. ఎస్సీ, ఎస్టీలు నివసిస్తున్న ప్రాంతాల్లో సంక్షేమ పథకాలు అంతంత మాత్రమే పంపిణీ అవుతున్నాయని, రాష్ట్రంలో బీజేపీ అధికారంలో లేకున్నా అన్ని సంక్షేమ పథకాలు అన్ని వర్గాల ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటోదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వయం సహాయక బృందాల్లో ఉన్న ప్రతి మహిళకు ఏదో ఒక రూపంలో లబ్ధి చేకూరుస్తున్నారని ఆమె అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం డీఎంకే ప్రభుత్వం కుటుంబ రాజకీయాలు ప్రోత్సహిస్తోందని, అయితే బీజేపీలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారికే పదవులు కట్టబెడుతున్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు. పొలాల్లో డ్రోన్ల ద్వారా పురుగుల మందు చల్లేందుకు మహిళా స్వయం సహాయక బృందాలకు శిక్షణ ఇప్పించడంతో పాటు వారికి కేంద్రప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తోందని తెలిపారు. తమిళనాడులో శాంతిభద్రతలు క్షీణించాయని, మాదకద్రవ్యాల వినియోగం విపరీతంగా పెరిగిందని, దీనిని నివారించేందుకు రాష్ట్రప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఈ సభలో ఎల్.మురుగన్, ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ సహా పలువురు పాల్గొన్నారు.

సత్యప్రదసాహుకు వ్యతిరేకంగా డీఎంకే కేసు

ప్యారీస్, ఏప్రిల్ 13: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహుకు వ్యతిరేకంగా డీఎంకే ప్రిసీడియం కార్యదర్శి ఆర్ఎస్ భారతి మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అందులో... లోక్‌సభ ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ప్రచారం చేసుకొనేందుకు వీలుగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి ముందుగానే అనుమతి పొందాల్సి ఉందని, ఆ రీతిలో తమ పార్టీ తరఫున అనుమతి కోరుతూ సమర్పించిన వినతిపత్రాన్ని రెండు రోజుల్లోపు పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీ చేయాల్సిందిగా సత్యప్రదసాహును ఆదేశించాలంటూ పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు వచ్చే అవకాశముందని కోర్టు వర్గాలు తెలిపాయి.

మద్యం లారీ బోల్తా



రోడ్డుపై పడిన మద్యం సీసాలు

పెరంబూర్, ఏప్రిల్ 13: వేలూరు గోదాము నుంచి వాణియంబాడి టాస్మాక్ దుకాణాలకు మద్యం తీసుకెళ్తున్న లారీ ఆంబూరు సమీపం బెంగళూరు జాతీయ రహదారిపై అదుపుతప్పి బోల్తా పడింది. ఈ లారీలో ఉన్న సుమారు 790 కేసుల మద్యం బాటిళ్లు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. రోడ్డుపై పడిన మద్యం బాటిళ్లను సమీపంలో ప్రజలు పోటీలు పడి పట్టుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకొని భద్రతా విధులు చేపట్టారు. ఈ ఘటనతో ఆ మార్గంలో సుమారు రెండు గంటలు వాహన రాకపోకలు స్తంభించాయి.

డివైడర్‌ను ఢీకొన్న తాగునీటి ట్యాంకర్ లారీ



పెరంబూర్, ఏప్రిల్ 13: స్థానిక కోయంబేడు సమీపంలో వేగంగా వెళ్తున్న తాగునీటి ట్యాంకర్ అదుపు తప్పి డివైడర్ ఢీకొంది. నగర ప్రజలకు తాగునీరు అందించేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ట్యాంకర్ లారీ యజమానులతో ఒప్పందం చేసుకుంది. ఒప్పందం మేరకు ఎవరు ఎక్కువ ట్రిప్పులు తోలాలని పోటీపడుతూ లారీలను అతివేగంగా నడుపుతుండడంతో, నగరంలోని పలు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో చిన్నారులు మృతిచెందగా, పలువురు గాయాలపాలవుతున్నారు. ఈ నేపథ్యంలో, శనివారం మధ్యాహ్నం కోయంబేడు సమీపంలో అతివేగంగా వస్తున్న ట్యాంకర్ లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఆ వేగానికి లారీ ముందు చక్రాలు ఊడిపడగా, లారీలోని నీరు రోడ్డుపై ప్రవహించింది. ఈ ఘటన కారణంగా ఆ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకొని లారీని తొలగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పరారైన లారీ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.



టి.నగర్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి విచ్చేసిన నాగాల్యాండ్ గవర్నర్ ఎల్.గణేశన్‌కు స్వామివారి ప్రసాదాలు అందిస్తున్న టీటీడీ చెన్నై సమాచారకేంద్రం సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్

అన్నామలై హెలికాప్టర్‌లో తనిఖీలు

ప్యారీస్, ఏప్రిల్ 13: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ప్రయాణించిన హెలికాప్టర్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తేనిలో బీజేపీ కూటమిలోని ఏఎంఎంకే నేత టీటీవీ దినకరన్‌కు మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న అనంతరం మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వంకు మద్దతుగా ప్రచారంలో పాల్గొనేందుకు శనివారం ఉదయం అన్నామలై రామనాథపురంకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో, బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జి నిర్మల్‌కుమార్ సురానాతో కలసి అన్నామలై ప్రయాణించిన హెలికాప్టర్‌ను 15 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించడం గమనార్హం.

సర్పంచి ఇంట్లో రూ.కోటి స్వాధీనం

ప్యారీస్, ఏప్రిల్ 13: లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో, ఓటర్లకు నగదు, బహుమతులు పంపిణీ చేయడాన్ని అడ్డుకొనేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో, తిరుచ్చి సోమరసంపేట సమీపంలో ఉన్న రెట్టరై ప్రాంతానికి చెందిన సర్పంచ్ దివ్య భర్త అన్బరసు కారులో కరెన్సీ కట్టలు తరలిస్తున్నారంటూ అధికారులకు సమాచారం తెలిసింది. దీంతో, జీయాపురం ఏఎస్పీ బాలచందర్ నేతృత్వంలోని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు రెట్టరైలో ఉన్న సర్పంచ్ ఇంటి ముందు నిలిపిన కారు వద్దకు చేరుకొని తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఇంట్లో పూజ గదిలో ట్రావెల్ బ్యాగులో ఉన్న రూ.500 కరెన్సీ కట్టలుండడం గుర్తించారు. సుమారు రూ.కోటి స్వాధీనం చేసుకొని ఆదాయపు పన్ను శాఖ అధికారులకు సమాచారం తెలియజేశారు. అక్కడకు చేరుకున్న ఐటీ అధికారులు దివ్య, అన్బరసు దంపతుల వద్ద విచారణ చేపట్టారు. ఈ సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న అన్నాడీఎంకే నిర్వాహకులు అధికారుల చర్యలను ఖండిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఆదివాసీలతో మంత్రి మురుగన్ నృత్యం

చెన్నై, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నీలగిరి బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి ఎల్ మురుగన్ కాలినడక ప్రచారం చేస్తున్నారు. గూడలూరు తాలూకా శ్రీమదురైకి వెళ్లిన మురుగన్‌కు అక్కడి ఆదివాసీలు డప్పులు వాయిస్తూ స్వాగతం పలికారు. ఆదివాసీ పసికందులను ఆయన ముద్దాడారు. ఆ తర్వాత ఆదివాసీల వాయిద్యాలకు అనుగుణంగా వారితో కలిసి నృత్యం చేశారు. ఆ తర్వాత గూడలూరులో జరిగిన రోడ్‌షోలో పాల్గొన్నారు.

ప్రశ్నించిన మహిళను అడ్డుకున్న కార్యకర్తలు

ప్యారీస్, ఏప్రిల్ 13: శివగంగ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి కార్తీ చిదంబరానికి మద్దతుగా మంత్రి పెరియకరుప్పన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సింగంపునరి సమీపంలోని ఎస్.కోవిల్‌పట్టిలో మంత్రి ప్రసంగిస్తుండగా జోక్యం చేసుకున్న ఓ మహిళ, తమ గ్రామంలో హై ఓల్టేజీ విద్యుత్ తీగ కిందకు వేలాడుతోందని, పలుమార్లు ఫిర్యాదు చేసినా ఈబీ అధికారులు స్పందించలేదని ఏకరువు పెట్టింది. అక్కడున్న కార్యకర్తలు ఆ మహిళను మాట్లాడనివ్వకుండా అడ్డుకోవడంతో పాటు మీడియాకు అడ్డుగా నిలిచారు. దీంతో మంత్రి తన ప్రసంగాన్ని నిలిపివేసి మెల్లగా జారుకున్నారు.

బీజేపీతో అన్నాడీఎంకే లోపాయికారి ఒప్పందం

● డీఎంకే ఘాటు విమర్శ

ప్యారీస్, ఏప్రిల్ 13: బీజేపీతో అన్నాడీఎంకే లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుందని, ఈ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను చిత్తుగా ఓడించాలని డీఎంకే ప్రజలకు పిలుపునిచ్చింది. డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయం శనివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. తమిళ ప్రజలకు, తమిళ భాషకు బీజేపీ, అన్నాడీఎంకేల వల్ల ఎలాంటి లాభం లేదని, ఆ రెండు పార్టీలు పదేళ్ల పాటు పదవుల్లో కొనసాగి ప్రజల సంక్షేమాన్ని విస్మరించాయని విమర్శించింది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ మాటలు నమ్మేందుకు రాష్ట్ర ప్రజలు జోకర్లు కాదని డీఎంకే పేర్కొంది.

21 ఏళ్ల యువతికి 'లైఫ్‌లైన్'



మీడియా సమావేశంలో వైద్య బృందం, చికిత్స పొందిన యువతి

చెన్నై, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): విపరీతమైన మెడనొప్పి, వెన్నునొప్పి, పక్షవాతానికి గురైన కాళ్లతో చెన్నైలోని లైఫ్‌లైన్ ఆసుపత్రికి చేరుకున్న 21 ఏళ్ల పశ్చిమబెంగాల్ యువతి సరికొత్త జీవితం పొందింది. ఆమె లాటోమోమెనింజియల్ మెనింజైటిస్ అనే అరుదైన స్థితిలో చిక్కుకుందని గుర్తించిన వైద్యులు.. తదుపరి పరీక్షలో అబ్‌స్ట్రక్టివ్ హైడ్రోసెఫాలస్, వెన్నుపూసలో కణితులు ఉన్నట్లు తేల్చారు. అంతేగాక కడుపులో క్షయ కణితుల్ని కూడా గుర్తించారు. అది తీవ్రమైన క్షయవ్యాధి కేసుగా నిర్ధారించారు. డాక్టర్ ఎం.అక్విబ్, డాక్టర్ అనిరుద్ రాజ్‌కుమార్ నేతృత్వంలోని వైద్యబృందం తగిన చికిత్స అందించింది. ఆ కారణంగా పది రోజుల్లోనే అద్భుతమైన మెరుగుదలనిచ్చింది. ప్రస్తుతం ఆమె కోలుకుంది. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు ఈ వివరాలను వెల్లడించారు.

వామ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



పాదచారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న బండారు సుబ్బారావు, తంగుటూరి రామకృష్ణ తదితరులు

ప్యారీస్, ఏప్రిల్ 13: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) ఆధ్వర్యంలో చూలైమేడులో శనివారం మజ్జిగ పంపిణీకి శ్రీకారం చుట్టారు. వామ్ గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ అధ్యక్షతన హైదరాబాద్‌కు చెందిన వామ్ గ్లోబల్ లీడర్ బండారు సుబ్బారావు సతీసమేతంగా పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సుమారు 4 వేల మందికి పైగా మజ్జిగ స్వీకరించారు. కార్యక్రమంలో తంగుటూరి రామకృష్ణ మాట్లాడుతూ... దేశంలో ఉన్న వామ్ విభాగాలు వేసవి తాపం ఉపశమనం కోసం పాదచారులకు మజ్జిగ, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. వేసవి ముగిసే వరకు ఈ వేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో చెన్నై కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ వై.విజయమూర్తి ప్రత్యేక అతిథిగా పాల్గొనగా, బెల్లంకొండ శివప్రసాద్, బద్రీనారాయణ, శ్రీలత, విజయమూర్తి హాజరయ్యారు.

తూత్తుకుడి జిల్లాలో అగ్గిపెట్టెల పరిశ్రమల బంద్

ప్యారీస్, ఏప్రిల్ 13: ప్లాస్టిక్ లైటర్ల దిగుమతిని అడ్డుకోవాలంటూ తూత్తుకుడి జిల్లా అగ్గిపెట్టెల పరిశ్రమల యజమానులు శనివారం నుంచి సమ్మె చేపట్టారు. ఈ నెల 22వ తేది వరకు సమ్మెలో పాల్గొననున్నట్లు జాతీయ అగ్గిపెట్టె ఉత్పత్తిదారుల సంఘం ప్రకటించింది. దేశంలో ఉత్పత్తి అవుతున్న అగ్గిపెట్టెల్లో 90 శాతం తమిళనాడులోనే తయారవుతున్నాయి. ప్రధానంగా, దక్షిణ జిల్లాలైన విరుదునగర్, తూత్తుకుడి, తిరునల్వేలి, తెన్‌కాశి తదితర జిల్లాల్లో సుమారు 4 లక్షల మందికి పైగా కార్మికులు ఈ పరిశ్రమల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో, కొన్నేళ్లుగా అగ్గిపెట్టెల వ్యాపారం సన్నగిల్లిందని, చైనా నుంచి దిగుమతి చేస్తున్న ప్లాస్టిక్ లైటర్ల విక్రయాలు పెరగడమే దీనికి కారణమని అగ్గిపెట్టెల పరిశ్రమల యజమానుల సంఘం సమ్మెకు పిలుపునిచ్చింది. ఆ మేరకు శనివారం నుంచి ఈనెల 22వ తేది వరకు అగ్గిపెట్టెల పరిశ్రమల మూసివేసి నిరసన వ్యక్తం చేస్తున్నారు.

సార్వత్రిక సమరం

తిరువణ్ణామలైలో గెలుపెవరిదో?



అన్నాదురై (డీఎంకే) | కలియపెరుమాళ్ (అన్నాడీఎంకే) | అశ్వత్థామన్ (బీజేపీ)



● వీఐపీ నియోజకవర్గం

ప్యారీస్, ఏప్రిల్ 13: రాష్ట్రంలోని 39 పార్లమెంటు నియోజకవర్గాల్లో తిరువణ్ణామలై 11వది. పంటలు పుష్కలంగా పండే వ్యవసాయ భూమి. ప్రపంచంలో గుర్తింపు పొందిన శైవక్షేత్రం అరుణాచలేశ్వర ఆలయం ఇక్కడే కొలువై ఉంది. 2008 సంవత్సరం ముందు వరకు తిరుపత్తూర్ పార్లమెంటుగా వ్యవహరించింది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం వేలూరు జిల్లాలోని జోలార్‌పేట, తిరుపత్తూర్ అసెంబ్లీ నియోజకవర్గాలు, తిరువణ్ణామలై జిల్లాలో ఉన్న సెంజి (రిజర్వుడు), తిరువణ్ణామలై, కలశపాక్కం, కీల్‌పెన్నాత్తూర్ శాసనసభ స్థానాలతో 2009వ సంవత్సరంలో తిరువణ్ణామలై లోక్‌సభ నియోజకవర్గం ఆవిర్భవించింది.

ఓటర్లు:

మార్చిలో విడుదలైన తుది ఓటరు జాబితా ప్రకారం తిరువణ్ణామలైలో మొత్తం ఓటర్లు 15,21,787 మంది. వీరిలో పురుషులు 7,49,000, మహిళలు 7,72,669 మంది కాగా ఇతరులు 118 మంది ఉన్నారు.

2019 ఎన్నికల ఫలితాలు....

ఈ నియోజకవర్గంలో 3 సార్లు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 2 సార్లు డీఎంకే, ఒకసారి అన్నాడీఎంకే గెలుపొందాయి. 2019 ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థిగా పోటీ చేసిన సీఎన్ అన్నాదురై 6,66,272 ఓట్లు పొందారు. ఆయనతో పోటీపడిన అన్నాడీఎంకే అభ్యర్థి 3,62,088 ఓట్లు పొంది ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఈ ఎన్నికల్లో ఏఎంఎంకే, నామ్ తమిళర్ పార్టీ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు.

సిట్టింగ్ ఎంపీ పనితీరు...

డీఎంకే సిట్టింగ్ ఎంపీ సీఎన్ అన్నాదురై పార్లమెంటులో ఇప్పటివరకు 52 చర్చల్లో పాల్గొన్నారు. తిరువణ్ణామలైలో తిష్టవేసిన సమస్యలకు సంబంధించి 442 ప్రశ్నలను ప్రస్తావించారు. చెన్నై - తిరువణ్ణామలై - జోలార్‌పేట మధ్య రైళ్లు నడపాలని, అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరువణ్ణామలైలో విమానాశ్రయం నిర్మించాలని డిమాండ్ చేశారు. జవ్వాదుమలై తదితర కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులు జీవనశైలి మెరుగుపరచడానికి చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రస్తుత అభ్యర్థులు...

ఈ స్థానంలో క్షత్రియులు, ఎస్సీ, ఎస్టీలు, మొదలియార్, యాదవులు 50 శాతానికి పైగా నివసిస్తున్నారు. వ్యవసాయం ప్రధాన వృత్తిగా ఉన్నందు వల్ల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహించాలని, గిరిజనుల ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలన్న డిమాండ్ల పరిష్కారానికి నోచుకోలేదు. ఈ సారి ఎన్నికల్లో రెండోసారి సిట్టింగ్ ఎంపీ సీఎన్ అన్నాదురై పోటీ చేస్తున్నారు. కాగా, అన్నాడీఎంకే తరఫున కలియ పెరుమాళ్, బీజేపీ తరఫున అశ్వత్థామన్ సహా 10 మందికి పైగా స్వతంత్రులు బరిలో ఉన్నారు.



దిండుగల్ లోక్‌సభ నియోజవర్గ సీపీఎం అభ్యర్థి సచ్చిదానందం ఎన్నికల ప్రచారంలో భాగంగా హోటల్ టీ చేసి కార్యకర్తలకు అందిస్తున్న దృశ్యం



పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి నమశ్శివాయానికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి



రామనాథపురం నియోజకవర్గంలో 'చెరుకు గడలతో రైతు' పోటీ చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి, బీజేపీ తరపున స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న 'ఓపీఎస్' పేరుతో ముద్రించిన పోస్టర్



చెన్నై రిప్పన్ భవనంలో శనివారం జరిగిన కార్యక్రమంలో 100 శాతం ఓటింగ్ అవగాహన ప్రచారంలో భాగంగా చెన్నై జిల్లా ఎన్నికల అధికారి జె.రాధాకృష్ణన్ సమక్షంలో సంతకాలు చేస్తున్న దివ్యాంగులు

● ఈనాటి అనుబంధ మేనాటిదో...

స్టాలిన్ కోసం స్వయంగా షాపుకెళ్లి...
స్వీటు కొనుగోలు చేసిన రాహుల్



బేకరి సిబ్బందితో రాహుల్ ఫొటో

పెరంబూర్, ఏప్రిల్ 13: కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ 'ఇండియా' కూటమి అభ్యర్థులకు మద్దతుగా శుక్రవారం సాయంత్రం కోయంబత్తూర్‌లో బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సభలో ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ కూడా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో, రాహుల్ గాంధీ హఠాత్తుగా వాహనం దిగి రోడ్డు మీద నడుచుకుంటూ డివైడర్‌ను ఎక్కి అవతలవైపున్న బేకరీకి వెళ్లారు. రాహుల్ గాంధీని చూసిన బేకరి యజమానులు, సిబ్బంది ఆశ్చర్యపోయారు. బేకరీలో వున్న మిఠాయిలను రాహుల్ పరిశీలించారు. ఇంతలో దుకాణ యజమాని రాహుల్‌కు ఓ స్వీటు అందజేయగా, ఆయన దాన్ని రుచి చూశారు. బేకరీలో కిలో జిలేబీని రాహుల్ కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా బేకరీలోని మహిళా సిబ్బందితో రాహుల్ ఫొటో తీసుకున్నారు. అనంతరం బహిరంగ సభ వేదిక వద్దకు వచ్చిన రాహుల్, తాను తెచ్చిన స్వీట్ ప్యాకెట్‌ను స్టాలిన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తాను స్వయంగా బేకరీకి వెళ్లి కొనుగోలు చేసినట్లు రాహుల్ చెప్పడం, అందుకు బదులుగా స్టాలిన్ చిరునవ్వులు చిందించే దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ మారాయి.

'ఇండియా' కూటమి తియ్యని విజయాన్ని రాహుల్‌కు ఇద్దాం

● ముఖ్యమంత్రి స్టాలిన్ ట్వీట్

ప్యారీస్, ఏప్రిల్ 13: లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి సాధించే విజయం అనే స్వీటును కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి బహుమానంగా ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ తన ఎక్స్ పేజీలో ట్వీట్ చేశారు. కోవైలో శుక్రవారం ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఏర్పాటుచేసిన ప్రచార సభలో రాహుల్ గాంధీ, స్టాలిన్ సహా అభ్యర్థులు, కూటమి పార్టీల నేతలు పాల్గొన్నారు. ఈ సభ ముగిసిన అనంతరం వాహనంలో వెళ్తున్న రాహుల్ గాంధీ ఊహించని విధంగా కారును కిందకు దిగి సమీపంలోని బేకరీ షాపుకు వెళ్లి స్వీటు కొనుగోలు చేసి, వేదిక వద్దకు వచ్చి సీఎం స్టాలిన్‌కు అందజేశారు. ఈ విషయమై సీఎం స్టాలిన్ స్పందిస్తూ.. రాహుల్ గాంధీ స్వీటు అందజేయడంపై స్టాలిన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. మనం కూడా ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి రాహుల్‌కు స్వీటుగా ఇద్దామని ఎక్స్ పేజీలో ట్వీట్ చేశారు.

దయానిధికి గుణపాఠం తథ్యం

■ సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం



ప్రజలకు వినోజ్ అభివాదం

చెన్నై, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే అభ్యర్థి దయానిధి మారన్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమయ్యారని బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం విమర్శించారు. ఈ నియోజకవర్గం నుంచి పలుమార్లు ఎంపీగా ఎన్నికైన ఆయన ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఒక్కపైసా కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజల్లో, ఎన్నికలయ్యాక మహల్లో అన్న చందాన ఆయన తీరు ఉందని, ఇలాంటి వ్యక్తికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. శనివారం ఆయన నియోజకవర్గంలో ముమ్మర ప్రచారం చేపట్టారు. థౌజండ్‌లైట్స్‌లో ప్రచారం చేపట్టిన ఆయనకు ప్రజలు పూలు చల్లుతూ స్వాగతం పలకడం విశేషం. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో అభివృద్ధి శూన్యంగా మారిందని, ప్రజల బాగోగులను పట్టించుకునే నాథుడు కరువయ్యాడన్నారు. డీఎంకే కుటుంబ పాలన అంతా.. తమ వారి బాగోగులు చూసుకునేందుకు సరిపోతోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలు గ్రహించి, ఒక్కసారి తనకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో తనను గెలిపిస్తే సెంట్రల్ చెన్నైని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు.

● టంగ్ స్లిప్పయింది బాస్

స్టాలిన్ నేతృత్వంలోని అన్నాడీఎంకే ప్రభుత్వం

● నోరు జారిన ఈపీఎస్



పెరంబూర్, ఏప్రిల్ 13: ఎన్నికల ప్రచారంలో ఆవేశంగా మాట్లాడుతున్న నేతలు టంగ్ స్లిప్పయి, ప్రత్యర్థుల పార్టీలను పొగడడం సహజంగా జరుగుతోంది. అలాగే, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి కూడా మాటల్లో తడబడ్డారు. తిరుప్పూర్ నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేపట్టిన పళనిస్వామి, అన్నాడీఎంకే ప్రభుత్వం అమలు చేసిన పథకాల గురించి సుదీర్ఘంగా వివరించారు. తాము అమలు చేసిన పథకాలకు స్టిక్కర్లు వేసుకుంటోంది 'స్టాలిన్ నేతృత్వంలోని అన్నాడీఎంకే ప్రభుత్వం' అంటూ మాట్లాడారు. ఆయన మాటలు విన్న కార్యకర్తలు ఒక్కసారిగా దిగ్భ్రాంతి చెందారు. కొద్దిసేపటికి తన తప్పు తెలుసుకున్న పళనిస్వామి, అన్నాడీఎంకే పాలనలో రాష్ట్రాభివృద్ధిలో విప్లవాత్మక మార్పులొచ్చాయంటూ సర్ది చెప్పుకున్నారు.

అందుకే అమ్మ నాకు టిక్కెట్టు ఇచ్చింది!

● అవునా?



ప్రచారంలో విజయ్ ప్రభాకరన్

పెరంబూర్, ఏప్రిల్ 13: విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గంలో అన్నాడీఎంకే కూటమి తరపున డీఎండీకే అభ్యర్థిగా దివంగత నేత విజయకాంత్ కుమారుడు పోటీ చేస్తున్నారు. ఆయనకు మద్దతుగా అన్నాడీఎంకే మాజీ మంత్రి ఆర్బీ ఉదయకుమార్ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా విజయ్ ప్రభాకరన్ మాట్లాడుతూ... తన తండ్రి విజయకాంత్ జన్మించిన స్థానంలో పోటీ చేయడం ఆనందంగా ఉందన్నారు. సోదరుడి సినిమా షూటింగ్ ఇక్కడ జరిగినప్పుడు తరచూ విరుదునగర్ వస్తుండడంతో, నియోజకవర్గంపై అభిమానం పెరిగిందన్నారు. తాను ఈ ఎన్నికల్లో గెలిస్తే ఈ ప్రాంతంలో ఇల్లు తీసుకొని ఉంటానని అమ్మ (డీఎండీకే ప్రధాన కార్యదర్శి)కు తెలపడంతో, ఆమె ఆనందంగా తనకు టిక్కెట్ ఇచ్చిందని విజయ్ ప్రభాకరన్ 'సెంటిమెంట్' ప్రచారం చేపట్టారు.

మేమూ... మోదీ 'గుడ్ ఫ్రెండ్స్'

● ఎట్టెట్టా?!



ఓపీఎస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్న జాన్ పాండ్యన్

పెరంబూర్, ఏప్రిల్ 13: మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం, తాను ప్రధాని మోదీకి మంచి స్నేహితులమని సీనియర్ నేత జాన్‌పాండ్యన్ తెలిపారు. రామనాథపురం నియోకవర్గంలో బీజేపీ కూటమిలో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఓ.పన్నీర్‌సెల్వంకు మద్దతుగా జాన్ పాండ్యన్ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓపీఎస్ మంచి మనస్సున్న వ్యక్తి అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆయన పాటుపడతారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రధానితో స్వయంగా మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. ఓపీఎస్‌ను మీరు గెలిపించండి... మీ సమస్యలు ఆయన తీరుస్తాడు.. అంటూ జాన్ పాండ్యన్ ప్రచారం చేపట్టారు.

బైక్‌పై శరత్‌కుమార్, రాధిక ప్రచారం

● ఏమి హాయిలే హలా!



పెరంబూర్, ఏప్రిల్ 13: 'మేఘాలలో తేలిపొమ్మన్నది....' అంటూ 'గులాబి' చిత్రంలో హీరో హీరోయిన్లు బైక్‌పై వెళ్తూ పాడే పాట అప్పట్లో హైలెట్‌గా నిలిచింది. తాజాగా, రాధిక, శరత్‌కుమార్ జోడీని చూసిన వారు మళ్లీ ఆ పాటను గుర్తుకు తెచ్చుకుంటున్నారు. విరుదునగర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా నటి రాధిక పోటీ చేస్తున్నారు. ఆమెకు మద్దతుగా ఆయన భర్త నటుడు శరత్‌కుమార్ ప్రచారం చేస్తున్నారు. శివకాశి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కృష్ణన్‌పేరిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రాధిక, హఠాత్తుగా ప్రచారం వాహనం నుంచి దిగి శరత్‌కుమార్ నడుపుతున్న బైక్‌పై ఎక్కి కూర్చొంది. వారిద్దరు బైక్‌పై గ్రామంలోని పలు వీధుల్లో కలియతిరుగుతూ ఓట్లు అభ్యర్థించగా, కార్యకర్తలు కూడా వారి వారి వాహనాల్లో వారి వెంట వెళ్లారు.

రాముడిలా 16 ఏళ్ల వనవాసం చేసిన దినకరన్

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

● ఏమి సెప్తిరి!



దినకరన్‌కు మద్దతుగా ప్రచారంలో అన్నామలై

పెరంబూర్, ఏప్రిల్ 13: తేని లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ కూటమి తరఫున అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ పోటీ చేస్తున్నారు. ఆయనకు మద్దతుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై పలు ప్రాంతాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా అన్నామలై మాట్లాడుతూ... 2026 ఎన్నికల తర్వాత నిజమైన నేతలు అన్నాడీఎంకే పగ్గాలు చేపట్టనున్నారని తెలిపారు. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పార్టీని కాంట్రాక్టర్లకు అప్పగించారన్నారు. ఆ పార్టీ తరపున బరిలో నిలిచిన అభ్యర్థులందరూ కాంట్రాక్టర్లేనని అన్నారు. రాముడు 16 ఏళ్లు వనవాసం చేసినట్లు, టీటీవీ దినకరన్ వనవాసం పూర్తిచేసి ప్రస్తుతం ఎన్నికల బరిలో నిలిచారన్నారు. ఆయన రాజకీయ చతురత, దూరదృష్టి దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఆలోచనలుగా ఉన్నాయని అన్నామలై ప్రశంసించారు.

ఆటో నడుపుతూ ప్రచారం



ఆటో నడుపుతూ ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి పాల్ కనకరాజ్

చెన్నై, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నార్త్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ తరఫున పోటీ చేస్తున్న పాల్ కనకరాజ్ ఆటో నడుపుతూ ప్రచారం చేశారు. పెరంబూరు శాసనసభ నియోజకవర్గం పరిధిలోని ముల్లైనగర్, ఆర్‌ఆర్‌నగర్, అభిరామి అవెన్యూ, కేకేడీ నగర్, కృష్ణమూర్తినగర్, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో 'తామర గుర్తుకు ఓటేసి గెలిపించండి' అంటూ నినాదాలు చేస్తూ ఆటో నడిపి సందడి చేశారు. కేకేడీ నగర్ ఆటో స్టాండు వద్దకు వెళ్లి అక్కడి ఆటో డ్రైవర్లకు కరపత్రాలు పంచిపెట్టి ఓటేసి గెలిపించమంటూ అభ్యర్థించారు.

నా కోరికను నా బిడ్డ నెరవేర్చాడు

చిత్రజ్యోతి

● విజయ్ తల్లి



లారెన్స్‌తో శోభ

తాను ఎంతో కాలంగా కోరుతున్న కోరికను తన బిడ్డ విజయ్ నెరవేర్చారని, ఇపుడు తనకు ఎంతో సంతోషంగా ఉందని సీనియర్ దర్శకుడు ఎస్ఏ చంద్రశేఖర్ సతీమణి, అగ్రహీరో విజయ్ తల్లి శోభ చంద్రశేఖర్ అన్నారు. కొరట్టూరులోని వెంకటేశ్వర నగర్‌లోని తన తల్లి కోరిక మేరకు సాయిబాబా మందిర్‌ను విజయ్ తన సొంత నిధులతో నిర్మించారు. ఈ ఆలయాన్ని ఈ నెల 11వ తేదీన ప్రారంభించి కుంభాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ్ సొంత పార్టీ తమిళగ వెట్రిక్కళగం నిర్వాహకులు పాల్గొన్నారు. హీరో విజయ్ కూడా ఆలయాన్ని సందర్శించి, దైవదర్శనం చేసుకున్నారు. గత కొన్ని రోజులుగా విజయ్ తల్లి ఈ ఆలయానికి వస్తూ తన ఇష్టదైవాన్ని దర్శించుకుంటున్నారు. దీనిపై ఆమె స్పందిస్తూ... 'తమ ప్రాంతంలో సాయిబాబా ఆలయాన్ని నిర్మించాలన్న కోరిక ఎప్పటి నుంచో ఉంది. ఈ విషయాన్ని విజయ్ దృష్టికి తీసుకెళ్లగా ఆ పని పూర్తి చేశారు. ప్రతి గురువారం ఈ ఆలయానికి వచ్చి సాయిబాబాను దర్శించుకుంటున్నాను' అని పేర్కొన్నారు.





'తలైవర్-171'లో సీనియర్ నటి శోభన?

సూపర్‌స్టార్ రజనీకాంత్ - యువ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ కాంబినేషన్‌లో ఒక చిత్రం రానుంది. రజనీ నటించే 171వ సినిమా. సన్ పిక్చర్స్ బ్యానరుపై నిర్మాత కళానిధి మారన్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించనున్నారు. ఇప్పటికే ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను నిర్మాణ సంస్థ విడుదల చేయగా, ఆయన అభిమానులతో పాటు ప్రేక్షకుల నుంచి స్పందన వచ్చింది. ఈ సినిమాకు 'కళుగు' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్టు వార్తలు వస్తున్నాయి. ఈ టైటిల్‌ను ఈనెల 22న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇందులోని ఒక ముఖ్య పాత్రకు సీనియర్ నటి శోభనను నటింపజేసేందుకు ఆమెతో సంప్రదింపులు జరుపుతున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. స్టంట్స్ అన్బరివు అందిస్తుండగా అనిరుద్ రవిచంద్రన్ సంగీతం అందించే ఈ చిత్రంలో నటించే హీరోయిన్, ఇతర నటీనటుల వివరాలను అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

కుటుంబ వినోదాత్మక చిత్రంగా 'వర్షంగళుక్కు శేషం'



'వర్షంగళుక్కు శేషం'లో నవీన్ పౌలీ

వినీత్ శ్రీనివాసన్ దర్శకత్వంలో రూపొందిన 'వర్షంగళుక్కు శేషం' మంచి కుటుంబ కథా నేపథ్యంతో వినోదాత్మక చిత్రంగా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఈ నెల 11న విడుదలైన ఈ చిత్రంలో నవీన్ పౌలీ, ప్రణవ్ మోహన్‌లాల్, ధ్యాన్ శ్రీనివాసన్ ప్రధాన పాత్రలను పోషించారు. ఇందులో నవీన్‌పౌలీ విలక్షణమైన నటనను ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు. ఈ సినిమా ద్వారా ఆయన డైనమిక్ యాక్టర్ అనే విషయాన్ని మరోమారు నిరూపించుకున్నారు. పైగా సినిమా అభిమానుల అభిరుచికి తగిన విధంగా స్క్రీన్‌ప్లే, కథ, కథనం ఉండటంతో హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. ముఖ్యంగా 1970-80 దశంలో ఔత్సాహిక చిత్ర నిర్మాతల జీవితాన్ని నేపథ్యంగా తీసుకుని దర్శకుడు అద్భుతంగా తెరకెక్కించారు. ముఖ్యంగా సినిమా రెండో భాగంలో నవీన్ పౌలీ.. ఎన్నో ఎమోషన్స్‌ని ఎంతో సూక్ష్మంగా వ్యక్తపరిచారు. అరగంట పాటు ప్రేక్షకులను తమసీట్లలో అతుక్కునిపోయేలా చేశారు. ఇతర పాత్రలను పోషించిన నటులు కూడా తమ నటనతో ఆకట్టుకున్నారు. వీరికితోడు సాంకేతిక నిపుణులు పనితనం సినిమాలో కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఒక బలమైన కథాంశంతో తెరకెక్కించిన ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తూ కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది.